రవిస్ కాలవ వంతెన దగ్గర యిప్పుడు అలంకార్ టాకీస్ వున్నచోట మునిసిపాలిటీదో ఎవరిదో ఖాళీస్థలం వుండేది. అక్కడ డేరాలు వేసి గుబ్బి వీరన్న కంపెనీ నాటకాలు వేసేవారు. సర్కస్‌లు వచ్చేవి. దుర్యోధనుడు, భీముడు, కృష్ణుడు - వీళ్ళ పెద్ద పెద్ద కటవుట్లు రవీస్ కాలవ వంతెనకి యిటూ అటూ నిలబెట్టేవారు. జట్కా బండిలో బేడ వుంటే కిరాయి ఎద్దు బండికి అణానే. రెండో ప్రపంచ యుద్ధ కాలంలోనో కాస్త ముందుగానో రిక్షాలొచ్చాయ్. 'రిక్షా' ఎక్కి మనిషి చేత లాగించుకోడానికి చాలామంది సిగ్గుపడేవారు. అలా ధైర్యం చేసి ఎక్కినవార్ని 'నరవాహనం' ఎక్కాడని వెక్కిరించేవాళ్ళు. రిక్షాకి కూడా అణన్నర, బేడ, మూణ్ణాలు యిచ్చేవారు.

ఈ రోజుల్లో బ్రాహ్మల్లో సబ్ కేస్ట్ ఫీలింగ్స్ ఎక్కువ. బందరులో వైదీకుల కాలేజీ, గుంటూరులో నియోగుల కాలేజీ వాళ్ళు వీళ్ళూ నన్నయ వైదీకనీ, తిక్కన నియోగనీ కొట్టుకు చచ్చేవాళ్ళు. మమ్మల్ని అభం శుభం తెలియని పిల్లల్ని మీరు వైదికులా నియోగులా అని అడిగేవారు. వైదీకులంటే జంధ్యాల దక్షిణా మూర్తి గారి దగ్గరకెళ్ళి వైద్యం చేయించుకునేవారు. నియోగులు టి.వి.యస్. చలపతిరావు గారి దగ్గరకి, కొమ్మూరి సాంబశివరావు గారి దగ్గరికి వెళ్ళేవాళ్ళు. విశ్వనాథ సత్యన్నారాయణ వైదిక కవి అనీ కాటూరి వెంకటేశ్వరరావుగారు, పింగళి లక్ష్మీకాంతంగారు నియోగి కవులనీ, వారి శిష్యులు వీరి శిష్యులూ కుస్తీలు పడుతూ వుండేవారు.

వన్ టవున్లో కాపులు, బ్రాహ్మలు, కోవట్లు ఎక్కువ వుండేవారనుకుంటా. గవర్నర్‌పేటలో బ్రాహ్మలు, కోవట్లు - సత్యనారాయణపురం, గాంధీనగరం బ్రాహ్మలు, కోవట్లు - ముఖ్యంగా వుండేవారు. అప్పుడే చుట్టుపక్కల గ్రామాల్నుంచి కమ్మవారు, గోదావరి జిల్లాల నుంచి రాజులు, నెల్లూరు వైపు నుంచి రెడ్లు బెజవాడ వచ్చి వ్యాపారాలు మొదలెట్టారు.

అప్పటి బెజవాడ స్టేషను ఓ షెడ్డులో వుండేదట. రైలు దిగి ఏలూరు కాలవ దాటి సత్యనారాయణపురం వెళ్ళాలన్నా, రవీస్ కాలవ వంతెన దాటిగవర్నరుపేట లోకి రావాలన్నా దొంగల భయం, అంతటా నిర్మానుష్యంగా వుండేదిట.

ఆనాటి బెజవాడ గురించి మరోసారి -

# బూచాడమ్మ బూచాడు లేక టెలిఫోన్‌రాక్షసుడు

సాక్షాత్తూ శ్రీకృష్ణుడి స్నేహితుడై యుండి కూడా కుచేలుడు అటుకులు పట్టికెళ్ళి దేముడికిచ్చి అష్టైశ్వర్యాలు పొందాడు గాని అతగాడు కమ్యూనిస్ట్ ఎందుకు కాలేదా అని నాకోడవుటు. కుచేలుడు నక్సలైట్ అయి కృష్ణుడి మీద మధురానగరి మీద తిరగబడాలి. కాని 'హరె రాం హరెకృష్ణ రాధే గోవింద' అని చిరతలట్టుకు డాన్స్ జేసుకుంటూ వీధుల్లో గంతులేస్తే ఆధ్యాత్మిక స్పృహ వస్తుంది కానీ సామాజిక స్పృహ వస్తుందా? శ్రీకృష్ణుడికున్నంత సామాజిక స్పృహ కుచేలుడికి లేదు. మన వాళ్ళంతా చెప్పినట్లు దోపిడీ చేసేవాడికి తెలిసినంత కమ్యూనిజం

పేదవాడికి తెలీదు. వున్నవాళ్ళకి మద పిచ్చి లేని వాళ్ళకి మత పిచ్చి పెట్టి దేవుడు జగన్నాటకం ఆడించేస్తున్నాడు కదా!

అసలు పాయింటేవిటంటే వున్నవాడ్ని చూసి లేనివాడు బాధపడటం, లేని వాడ్ని చూసి వున్నవాడు వీడికి బి.పి., నిద్ర పట్టకపోవడం, వూబ వొళ్ళు వగైరాలేవీ లేవు కదా అని అసూయ పడ్డం, దీనమ్మకడుపుమాడ ఏది తిన్నా పడదు, పైగా డాక్టరు అన్నీ మానేయమంటాడు, బీదోడికి యిన్ని బాధలు లేవు లేనేలేవుగదా అని చింతిల్లడం యివన్నీ చిత్రంగా వుంటాయి - నిజమే! బెండకాయ కూర జిగురు శ్లేష్మం, వంకాయ కూర ఎలర్జీ తింటే వళ్ళంతా దురదలు, గోంగూర, ఆవకాయ, కొరివికారాలు సరేసరి - వేడి - వేడి - వేడి, ఆనపకాయ పెరుగుపచ్చడి గుమ్మడికాయ పులుసు వాతం జలుబు శ్లేష్మం అన్నీనూ. ఆఖరికి పెరుగు మీగడలు తిన్నా ఎలర్జీ. శ్రీకృష్ణ లీలల్లో పరమాత్మ పెరుగులు మజ్జిగలూ పాలు వెన్నలు మాగాయ టెంకలు ఎన్ని తిన్నా పదహారు వేల మంది స్త్రీలతో ఎన్ని కేళీ విలాసాలు జరిపినామొహం మొత్తదు (లా ఆఫ్ డిమినిషింగ్ రిటన్స్ లేదు - పైగా కేళీలోలామదన గోపాలా అని పొద్దం మరియు అంగనామంగనా మంతరే మాధవం అని అదో గొడవ) మనకన్నీ ప్రాణాంతకాలే! పేదల జీవితం ఎంత హాయి? డబల్‌కాట్ మంచం ఫోం పరుపులూ, ఏసి పన్జేయడం లేదనే ఏడుపు యిలాంటి వేవీ లేవు కదా! యింత గంజిలో వుప్పేసుకుని లేదా ఓ పచ్చిమిరపకాయ ఓ వుల్లిపాయి యింత పిసరు చింత పండుతో బండమీద నూరుకుని వణ్ణంలో కలుపుకు తినేసి (దీన్నే కలో గంజో తిని తాగడం అంటారు) హాయిగా కాలవల్లోనో పంపులవద్దో స్నానం చేసి ఆ బట్ట పిండుకుని చెట్టు కొమ్మల మీద ఆరేసుకుని ఆ చెట్టు క్రిందే ఓపెన్ ఎయిర్‌లో పండుకోడంలో ఎంత హాయి, ఎంత సింపులు, ఎంత ఆరోగ్యం వగైరా వగైరా;

ఇంతకీ ఒకడ్ని చూసి ఒకడు ఏడవడం అనేది అన్నెససరీ కాదు నెససరీ, దుఃఖంబులెన్ని విధములయినా, జెలసీ వలన సొసైటీలో చాలా 'ప్రోగ్రెస్' జరుగుతుంది. ఒకరికి వుందని యేడిస్తే ఒక్కన్నూ తనకు లేదని యేడిస్తే మరో కన్నూ పోయిందని చెప్తారు గాని అలా కళ్ళు పోయినవాళ్ళెవరూ నాక్కనబళ్ళేదు.

అసలీ గొడవంతా ఎందుకొచ్చిందంటే జన్మ దుఃఖం, జరా దుఃఖం, జాయా దుఃఖం పునః పునః అన్నారు గాని వాళ్ళు మరో దుఃఖాన్ని జోడించడం మర్చిపోయారు. అది టెల్లిఫోన్ దుఃఖం టెల్లిఫోన్ వున్నవాడి దుఃఖం లేని వాడి దుఃఖం కంటే ఎక్కువ. గవర్మెంటు చేసే మంచి పనుల వలన కలిగే దుఃఖం కూడా ఏమంత తక్కువది కాదు.

టెలిఫోను వున్నవాడ్ని చూసి లేనివాడు 'వీడికి రాంగ్ కాల్స్ రానూ, వీడి ఫోను డెడ్డయిపోనూ, పక్కవాడి బిల్లు వీడి బిల్లులో కలిసిపోనూ, ఇరుగూ పొరుగూ వీడి ఫోను మీద పడి చావ', అని బాణాలు వేస్తాడు. టెల్లిఫోను లేనివాడికి 'నీకు టెలిఫోను బిల్లు రానూ' అని తిడితే వాడు సంతోషిస్తాడనుకునేరు, భోరున విలపిస్తాడు 'ఆరు కోట్ల బైరాగిని టెలిఫోన్ బిల్లు కట్టమన్నట్లు'

వుడికుడికి. టెలిఫోను బిల్లు కట్టమనడం ఆరు కోట్ల ఆంధ్రుల్ని ప్లస్ దేశాన్ని అవమానించడం కాదు గదా!

కొంతకాలం క్రితం ఓ పత్రికాఫీసులో ఓ రిటర్నింగ్ ఆఫీసరుండేవాడు. అతను కథలు పంపినవాళ్ళకి న్యూయియర్స్‌డే, పండగలు, దివాలీ లాటి వాట్ని చూసి కథలు ఠంచనుగా అందేట్లు రిటన్ చేసేవాడ్ట. పండగ బహుమతిగా ఓ అమ్మాయికి గాని అబ్బాయికి గాని కథ రిటనొస్తే - యిక వాళ్ళ మూడంతా పాడైపోదూ? పెళ్ళి కాని అమ్మాయి అయితే అన్నలు అక్కలు వదిన్లు బావలు ఏడిపిస్తారు. ఆ పేపరువాడ్ని పరపరా కోసి వుప్పూ కారం జల్లి నంచుకు తినాలనుంటుంది. పెళ్ళయి కాపురం చేస్తున్నావిడయితే మొగుడికి దుప్పే. పిల్లలుంటే వాళ్ళకి దుప్పే. కారాలూ మిరియాలే గాని పండగయినా పబ్బమయినా బొబ్బట్లూ పులిహోర లడ్డూ జాంగ్రీ వుండదంటారు గాని స్త్రీలకు గ్లామరుతో పని గాని గ్రామరుతో వుండదు కదా! ఇక అదే మగాడయితే ఆఫీసులో యింట్లో క్లబ్బులో ఫ్రండ్ దగ్గర ఎంత ఇన్ సల్టయిపోతుందంటే - కథ వ్రాయని జన్మ ఒక జన్మా అనుకునేవాడు కాస్తా తన కథా రచన గొప్పతనం గ్రహించే నేర్పు యేడ్పు వాడికెక్కడేడిసింది అని తిడ్తాడు కాని ఎంత మంది కళ్ళు కప్పినా పోస్ట్‌మాన్ చూపుల్ని భరించడం కష్టం. అద్దంలో అంతరాత్మ కంటే డేంజరు వాడు.

అసలింతకీ అన్నం వదిలి సున్నంలో పడ్డాం. టెలిఫోన్ తీస్తే ఫెడేల్మని చెంపమీద కొట్టినట్లు రాంగ్ నంబర్ అని వస్తుంది. ప్లస్ ఇంటూ ప్లస్ యీజీక్వల్టు మైనస్ కాదు గాని రెండురాంగ్ నంబర్లు కలిసి కాని విడిపోయి కాని ఒక రైటు అవవు కదా!

మా చిన్నప్పుడు సర్కస్‌లో బఫూన్‌గాడు మరో బఫూన్ గాడ్ని చెంపదెబ్బ కొడితే వాడు తగిలిన చోట కాక మరోచోట రియాక్షన్ చూపెట్టినట్లు - మనం ఒక నంబర్‌కి డయిల్ చేస్తే అది తప్ప పది పది హేనుమంది లైన్ మీదకొచ్చి తర్పణాలు వదలని పిత్రు దేవతల్లా నిలబడతారు. తెల్లారి లేవగానే ఫోను ముట్టుకోవాలంటే భయం - అందులోంచి యే తిట్లూ దీవెనలూ వస్తాయోనని. యస్.టి.డి. వుంది గదాని చేస్తే అదీ రాంగ్‌నంబరే. లైన్ సరిగ్గా లేదు లైన్ సరిగ్గా లేదు అంటారు. అంటే ఎవడి లైన్? చేసినవాడిదా? టెలిఫోను వాడిదా?

పూర్వజన్మ కృతం పాపం టెలిఫోన్ రూపేణ పీడితం - అని అనుకుని వూరుకుంటే రాంగ్ బిల్లులతో వచ్చే టెలిఫోన్ బిల్లుల మాటేవిటి? నిజంగా బిల్లులు కట్టకపోతే లైన్ కోసేస్తామంటారు నిజమే! మరి రాంగ్ బిల్లులు కట్టకపోతే కూడా లైన్ కట్ చేస్తామంటే ఎల్లాగ? 'బూచాడమ్మ బూచాడు బుల్లి పెట్టెలో వున్నాడ'ని ఆత్రేయ మహాకవి ఏ నోటితో అన్నారో గాని టెలిఫోన్ వాడు నిజంగా బుల్లి పెట్టెలో వున్న బూచాడే!

(బూచాళ్ళను తన్నడానికి కుచేలుడు కూడా నక్సలైటై వస్తాడు జాగ్రత్త!)